సాక్షి
అనకాపల్లి
శనివారం । 23 । ఆగస్టు । 2025



ఖరీఫ్ లక్ష్యం 56వేల హెక్టార్లు

ఖరీఫ్ సీజన్‌లో 56వేల హెక్టార్లలో వరి 8లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.



లక్ష కుంకుమార్చన

సింహాచలం: సింహగిరిపై సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేషంగా నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 33.9 నుంచి 34.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.5 నుంచి 27.4 డిగ్రీలు ఉంటాయన్నారు.

తగ్గేదేలే..!

- పేట్రేగిపోతున్న గంజాయి స్మగ్లర్లు
- యథేచ్ఛగా రవాణా
- విద్యార్థులు, యువతే లక్ష్యం
- ఏడాదిలో భారీగా పెరిగిన కేసులు
- ఏజెన్సీ నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా తరలింపు
- తనిఖీలు అంతంత మాత్రమే

గంజాయి స్మగ్లర్లు బరితెగిస్తున్నారు. పోలీసుశాఖ ఎన్ని చెక్‌పోస్టులు పెట్టినా లెక్క చేయడం లేదు. విద్యార్థులు, యువతకు డబ్బు ఎర వేసి, ఏజెన్సీ నుంచి వివిధ మార్గాల్లో గంజాయిని రప్పించి, జిల్లా నుంచి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు యథేచ్ఛగా ఎగుమతి చేస్తున్నారు.



రోలుగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని తరలిస్తుండగా పట్టుబడిన వాహనాలు



వి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధి బుద్దరేవు గ్రామం పరిసరాల్లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

సాక్షి, అనకాపల్లి:

గంజాయి రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. తనిఖీలు అంతంతమాత్రంగా జరుగుతుండడంతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో కన్నా ఈ ఏడాది గంజాయి కేసులు విపరీతంగా పెరిగాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏవోబీ ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి సాగు చేస్తున్నారు. అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈగల్ విభాగం, శాంతి భద్రతల పోలీసులు సంయుక్తంగా జిల్లాలో ఐదు స్టాటిక్ చెక్ పోస్టులు, 38 డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ వారి కళ్లు కప్పి మరీ తరలించేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ 10,091 కిలోల గంజాయిని, 9 వేల హషీష్ ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో 170 కేసుల్లో 500 మందిని అరెస్ట్ చేశారు. ఏడుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ఇంత పెద్ద మొత్తంలో ఉంటే పట్టుబడని గంజాయి ఎంత ఎక్కువగా ఉంటుందో చెప్పనవసరం లేదు.

కాలేజీ విద్యార్థులే టార్గెట్

స్మగ్లర్లు...యువత, విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి రవాణా, విక్రయాలు సాగిస్తున్నారు. అటు ఏజెన్సీ, ఇటు మైదాన ప్రాంతానికి మధ్యలో గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, చోడవరం, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల మీదుగా జాతీయ రహదారికి, రైల్వే స్టేషన్లకు, విశాఖ నగరానికి గంజాయిని తరలిస్తున్నారు.

ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు, విద్యార్థులు గంజాయి సేవించడం, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతుండడంతో విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

నర్సీపట్నం కేంద్రంగా...

గంజాయి విక్రయాలకు, వినియోగానికి నర్సీపట్నం కేంద్రంగా మారుతుండడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కళాశాలలు, విద్యా సంస్థల వద్ద కాపు కాసి కొన్ని ముఠాలు విద్యార్థులను గంజాయి ఉచ్చులోకి లాగుతూ వారి జీవితాలను నాశనం చేస్తున్నాయి. పట్టణంలో ఇటీవల గంజాయి సేవించే యువకుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అన్ని ప్రాంతాల్లో గంజాయి సులభంగా లభిస్తుండడంతో విద్యార్థులు దానికి బానిసలుగా మారుతున్నట్టు సమాచారం. గంజాయి విక్రయిస్తున్నవారిలో యువతులు కూడా ఉండడంపై పోలీసులు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ఇద్దరు యువతులను పోలీసులు విచారించి హెచ్చరించినట్టు తెలిసింది. ఏజెన్సీ నుంచి వచ్చే గంజాయి వ్యాపారులకు స్థానికంగా కొందరు షెల్టర్ ఇవ్వడంతో పాటు ఇక్కడ నుంచి పోలీసుల నిఘా లేని సమయాల్లో సులభంగా అనకాపల్లి, విశాఖనగరానికి గంజాయిని తరలించడంలో భాగస్వాములవుతున్నట్టు సమాచారం. వ్యాపారులు ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణా చేయడంతో పాటు స్థానికంగా కళాశాల విద్యార్థులు, యువకులకు కూడా విక్రయిస్తున్నట్టు తెలిసింది.

జిల్లాలో కేసుల వివరాలు ఇలా..

- 2024 ఏడాదిలో(జూన్ నెల నుంచి డిసెంబర్ వరకూ) గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు 81 కేసులు నమోదు చేసి, మొత్తం 3,326.43 కిలోల గంజాయి, రెండు వేల లీటర్ల హషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ప్రమేయం ఉన్న 220 మందిని పోలీసులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న 96 మంది నిందితులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ గంజాయి రవాణాలో వినియోగిస్తున్న 113 వాహనాలను సీజ్ చేశారు.
- 2025లో జనవరి నెల నుంచి 89 గంజాయి కేసులు నమోదు చేసి, 280 మందిని అరెస్ట్ చేశారు. ఈకేసుల్లో రూ.3,39,43,600 విలువైన 6,765 కిలోల గంజాయి, 5.300 లీటర్ల హషీష్ ఆయిల్, 73 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఏడు గురిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. గంజాయి అక్రమ రవాణాలో ఆస్తులు సంపాదించిన ఇద్దరు స్మగ్లర్ల ఆస్తులను జప్తు చేశారు.
- రోలుగుంట పోలీసు స్టేషన్ పరిధిలో గల రత్నంపేట గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరరావు గంజాయి క్రయ విక్రయాలు, అక్రమ రవాణా ద్వారా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన సుమారు రూ.2 కోట్ల విలువ చేసే 15.36 ఎకరాల వ్యవసాయ భూమిని ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనలు ప్రకారంగా స్వాధీనం చేసుకున్నారు.

బొడ్డేరు నదిపై కుంగిన వంతెన

- నిలిచిన రాకపోకలు
- ఇక్కట్లకు గురవుతున్న రెండు మండలాల ప్రజలు



కుంగిపోయిన వంతెన

బుచ్చెయ్యపేట: మండల శివారు విజయరామరాజుపేట, చీడికాడ మండలం కట్టువాని అగ్రహారం గ్రామాల మధ్య బొడ్డేరు నదిపై గల వంతెన కుంగిపోయింది. దీంతో రెండు మండలాల్లో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో అధిక లోడుతో లారీ వెళుతుండగా వంతెన ఒక్కసారిగా కుంగిపోయింది. ఈ సమయంలో మూడు చోట్ల బ్రిడ్జి దెబ్బతింది. దీంతో నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. వంతెనకు రెండు వైపులా పోలీసులు బారికేడ్లు, కాపలా ఏర్పాటు చేశారు. వంతెన కుంగిపోవడంతో ముఖ్యంగా విజయరామరాజుపేట,కట్టువాని అగ్రహారం,దండి సురవరం,దిబ్బపాలెం, ఇంటిపాలెం,తునివలస,చీడికాడ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికే బుచ్చెయ్యపేట మండలంలో భీమునిపట్నం,నర్సీపట్నం(బీఎన్) ప్రధాన రోడ్డులో వడ్డాదిలో పెద్దేరు నదిపై ఉన్న పెద్దేరు వంతెన, విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై ఉన్న తాచేరు వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. ఈ రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్లు మూడు రోజుల కిందట కురిసిన వర్షాలకు కొట్టుకుపోయాయి. దీంతో అనకాపల్లి,అల్లూరి,విశాఖపట్నం జిల్లాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.ఇప్పుడు బొడ్డేరు నదిపై గల వంతెన కుంగిపోయింది. రెండు మండలాలను కలిపే లింకు రోడ్డులో ఏర్పాటు చేసిన వంతెన కూలడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్ల కిందట బొడ్డేరు నదిపై ఈ వంతెన నిర్మించారు. దేవరాపల్లి, చీడికాడ, బుచ్చెయ్యపేట, మాడుగుల, రావికమతం మండలాల్లో జరిగే వారపు సంతల్లో విక్రయించేందుకు రైతులు పంటలు, పాడి పశువులు,గొర్రెలు,మేకలు,నాటుకోళ్లు రవాణా చేసేందుకు ఈ రహదారినే ఎక్కువగా వినియోగిస్తారు. కూలిన వంతెన ప్రదేశంలో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు వంతెన నిర్మించాలని బుచ్చెయ్యపేట,చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల తదితర మండలాల ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు చేయాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్



జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: ఎరువుల అక్రమ నిల్వలపై జాయింట్ టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. అమరావతి నుంచి శుక్రవారం ఖరీఫ్-2025లో ఎరువుల లభ్యతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు, తదితరులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ మండల స్థాయిలో మల్టీ డిసిప్లినరీ టీమ్స్‌ను సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్‌హెచ్‌వోలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంఏవోలతో ఏర్పాటు చేసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. యూరియా గురించి ప్రతికూల వార్తలు వచ్చినప్పుడు వాస్తవ పరిస్థితులు బట్టి వివరణ ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న సాగు విస్తీర్ణంను బట్టి ఎరువుల సరఫరా, లభ్యత వివరాలను ప్రతి రోజూ కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని చెప్పారు. ప్రతి ఎరువుల షాపు వద్ద ఓ వీఆర్‌ఏను నియమించి అమ్మకాలను పర్యవేక్షించాలన్నారు. ఆర్‌ఎస్‌కే పరిధిలో పంటల సాగు విస్తీర్ణానికి అవసరమైన యూరియా లభ్యత వివరాలు రోజూ 8 గంటలకు మల్టీ డిసిప్లినరీ కమిటీకి తెలియజేయాలని ఆమె సూచించారు. జిల్లా వ్యవసాయ, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్స్‌ను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

ఎక్కడైన సమస్యలు ఉంటే జిల్లా వ్యవసాయ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 8331056471లో సంప్రదించాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీజన్‌కు ముందే రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఎరువులు,విత్తనాలను అరకొరగా సరఫరా చేయడం విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వానికి ముందస్తు ఆలోచన లేక రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకోలేక రైతులు సతమతమవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులతో కలిసి ఈనెల 26న మునగపాక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. దివ్యాంగ పింఛన్‌లను తగ్గించడం సరికాదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పింఛన్‌లను తగ్గించేందుకు కుతంత్రాలు చేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు,కర్రి పెద బ్బాయి,సుందరపు తాతాజీ,ఆడారి త్రిమూర్తులు,ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు,నాగేశ్వరరావు,మళ్ల కాశీ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరాహ సత్యనారాయణ, నాయకులు నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశీబాబు, కాండ్రేగుల జగన్, దొడ్డి బుజ్జి, మొల్లేటి శంకర్, పెతకంశెట్టి రామజోగినాయుడు, కన్నుంనాయుడు,బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

25న ఉపాధ్యాయుల మహాధర్నా



ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

నర్సీపట్నం: పాత పెన్షన్ వర్తింపు చేయాలని డిమాండ్ చేస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 25న చలో విజయవాడ నిర్వహించనున్నారు. విజయవాడలోని అలంకార్ కూడలి వద్ద ధర్నాకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా ఏడు మండలాలకు చెందిన ప్రతినిధులు శుక్రవారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో సమావేశమయ్యారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. పలువురు ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా డీఎస్సీ 2003 బ్యాచ్ ఉపాధ్యాయులు అనివార్యంగా సీపీఎస్ విధానంలోకి బలవంతంగా నెట్టబడ్డారన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని డీఎస్సీ 2003 బ్యాచ్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం ఫోరం నాయకులు చుక్కల రాము, పీఆర్‌టీయూ నాయకులు కె.వి.రమణ, ఎ.అప్పారావు, బి.అప్పారావు, జి.వి.రమేష్, ఏపీటీఎఫ్ నాయకులు పడాల అప్పారావు, శర్మ, దొర, యూటీఎఫ్ నాయకులు ఎం.చిట్టియ్య, గాయత్రీ తదితరులు మాట్లాడారు.

బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్లకు ఇ-వేలం నిర్వహిస్తున్నామని నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. మూడేళ్ల (2025-28)కాలపరిమితితో బార్లకు లైసెన్స్ పొందవచ్చన్నారు. ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కోదానికి రూ.5 లక్షలు, ప్రాసెస్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్‌లైన్‌లో కానీ అప్లై చేసుకుని, ఈ నెల 29 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

అడ్డంగా బుక్కైన మేయర్

- విరుచుకుపడ్డ కూటమి కార్పొరేటర్లు
- కౌన్సిల్లో కోళ్ల వ్యర్థాలపై రగడ..
- అధికారపార్టీ కార్పొరేటర్ల నిలదీత
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల గళం..



మేయర్ పోడియం ముందు బైఠాయించిన వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు

దాబాగార్డెన్స్(విశాఖ) : కోళ్ల వ్యర్థాల తరలింపును అడ్డుకోవడానికి ప్రయత్నించిన తనపైనే ఆరోపణలు చేయిస్తున్నారని స్వయంగా టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీను ఆరోపించారు. జీవీఎంసీలో ఒక అధికారి కిశోర్ ఏళ్లుగా తిష్టవేసి కూర్చున్నారని, ఆయన తీరు బాగోలేదని ఎండగట్టారు. మేయర్ అవినీతిపై సొంత పార్టీ కార్పొరేటర్ నుంచే విమర్శలు రావడంతో మేయర్ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. దీంతో చేసేదేమీ లేక చర్యలు తీసుకుంటానని బెదిరించే ప్రయత్నం చేయడం విమర్శలకు దారి తీసింది.

కోళ్ల వ్యర్థాల దందా కూటమి నేతలదే!

(సాక్షి ఇటీవలే ఈ కథనాన్ని ప్రచురించింది)

జీవీఎంసీ పరిధిలో కోళ్ల వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడకు తరలించాలి. ఇందుకోసం 8 జోన్లకు ఒక్కొక్కరి చొప్పున మొత్తం 8 మంది కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. అయితే కూటమి కి చెందిన కొందరు నేతలు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుని కోళ్ల వ్యర్థాలను సేకరించి చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నారు. ఈ విషయంపై ఫొటోలతో సహా కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా, అధికారులు ఆ వాహనాలను పట్టుకుని మళ్లీ వదిలేయడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారంలో కీలకమైన కూటమి ఎమ్మెల్యేలతో పాటు, తెర వెనుక ఉండి రౌడీషీటర్ల ద్వారా వ్యవహారం నడిపిస్తున్న జీవీఎంసీలోని కీలక నేత తీరుపైనా అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ దందాకు జీవీఎంసీలో ఏళ్ల నుంచి పని చేస్తున్న ఒక అధికారి తీరుపైనా కౌన్సిల్‌లో విమర్శలు వ్యక్తమయ్యాయి. కోళ్ల వ్యర్థాల దందాపై సొంత పార్టీ నుంచే విమర్శలు వస్తుండటంతో, మేయర్ తన పదవి గౌరవాన్ని కూడా విస్మరించి ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంలో విచారణ జరపకుండా ఆరోపణలు చేస్తున్న వ్యక్తులను బెదిరించడంతో మేయర్ వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చర్చ జరపాలని పట్టుబట్టారు.

సొంత పార్టీలోనే విపక్షం : కోళ్ల వ్యర్థాల అక్రమ తరలింపుపై శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ తరలింపులో రౌడీషీటర్ల ప్రమేయం ఉందని టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆరోపించారు. గంధం శ్రీనివాసరావుతో పాటు టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ చెన్నా జానకీ రామ్ సహా మరికొంతమంది కార్పొరేటర్లు ఈ వ్యవహారంపై అధికారులను నిలదీశారు. ఒకే అధికారి చాలాకాలంగా జీవీఎంసీలో పనిచేస్తూ రౌడీషీటర్లకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇచ్చిన వివరణపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో కమిషనర్ కేతన్ గార్గ్ జోక్యం చేసుకున్నారు. తాను బాధ్యతలు స్వీకరించాక పత్రికల్లో ఈ విషయమై అనేక కథనాలు చూశానని, తప్పిదాలు ఉన్నట్టు తెలుస్తోందని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.



నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

మేయర్ వర్సెస్ గంధం

కోళ్ల వ్యర్థాల అంశంపై కార్పొరేటర్ గంధం శ్రీను మాట్లాడుతున్నప్పుడు మేయర్ పీలా శ్రీనివాసరావు అడ్డుకున్నారు. తాను ఒక అక్రమ వాహనాన్ని పట్టుకుని అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చానని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లిలో ఒక వ్యక్తి తన వాహనాన్ని అడ్డుకుని, అక్కడి సిబ్బందితో తనపై ఆరోపణలు చేయించి, సోషల్ మీడియాలో పెట్టారని గంధం శ్రీను చెప్పారు. 'సమయం వృథా అవుతోంది, మిగతా అంశాల్లోకి వెళ్దాం' అని మేయర్ పీలా చెప్పగా, గంధం మండిపడ్డారు. దీనిపై చర్చ జరగాల్సిందేనని ఆయన పోడియం వైపు దూసుకుపోయారు. 'కూర్చోకపోతే చర్యలు తీసుకుంటా' అంటూ మేయర్ హెచ్చరించారు. 'నువ్వు అధికార పార్టీ సభ్యుడివై ఉండి ఇలాగే మాట్లాడుతావా?' అంటూ మేయర్ మండిపడ్డారు.

సభ జరిగిన తీరిది..

ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. అజెండాలో 84 అంశాలు, టేబుల్ అజెండాలో 67 అంశాలు చర్చకు వచ్చాయి. మొత్తం 151 అంశాల్లో కేవలం రెండు అంశాలు మాత్రమే వాయిదా పడ్డాయి. ఒక్కో అంశానికి 5 నిమిషాలు చర్చించినా, సుమారు 750 నిమిషాలు (దాదాపు 12-13 గంటలు) పడుతుంది. కానీ అలా జరగకుండా తూతూ మంత్రంగా నిర్వహించి 149 అంశాలను ఆమోదించారు.

బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు పనులా?

విజయవాడలో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన ఒక సంస్థకు పనులు అప్పగించేలా ఒకేసారి రెండు సంవత్సరాలకు స్వీపింగ్ యంత్రాల మరమ్మతు పనుల అంచనాలను రూపొందించడంపై ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి సంస్థకు పనులు అప్పగించేందుకు అనుకూలంగా నిర్ణయాలు ఎలా తీసుకుంటారని విమర్శించారు. అయితే, ఎలాగైనా ఈ అంశాన్ని ఆమోదింపజేయాలని మేయర్ ప్రయత్నించారు. సభ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో, తిరిగి ఒక ఏడాదికి అంచనాలు రూపొందించేందుకు కౌన్సిల్ నిర్ణయించింది.

వీటిపై అసలు చర్చేలేదు

టీడీఆర్‌ల జారీ, కోడి వ్యర్థాల సేకరణ, డంపింగ్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కేటాయింపులు, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంబంధిత అంశాలు, రెవెన్యూ షాపుల కాంట్రాక్ట్, జీ-20 పనులు, బహిరంగ టెండర్లు, పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ హక్కుల రక్షణ, పాత జైల్ రోడ్డులో రాత్రి పూట ఫుడ్ కోర్టు, ప్రత్యేక కమిటీల నియామకాలు, ప్రస్తుత ఆస్తి పన్ను రీసర్వే వంటి ముఖ్యమైన అంశాలున్నప్పటికీ, కేవలం మొదటి నాలుగు అంశాలు మాత్రమే చర్చించి మిగిలిన వాటిని వదిలేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కౌన్సిల్ ఆమోదం తెలపాలి

వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లూ శంకరరావుతో పాటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బొడ్డు గంగారావు, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కౌన్సిల్ ఆమోదం తెలపాలని పెద్ద ఎత్తున పట్టుబట్టారు. నల్ల దుస్తులు ధరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నిరసన దాదాపు రెండు గంటల పాటు సాగింది. చివరకు మేయర్ దిగివచ్చి, మీరు లేఖ ఇవ్వండి, ప్రభుత్వానికి పంపుతానని చెప్పారు.



మేయర్ వైఫల్యం

సభను సజావుగా నిర్వహించడంలో మేయర్ పీలా శ్రీనివాసరావు విఫలమయ్యారు. ఒక అంశంపై చర్చ వచ్చినప్పుడు మేయర్ నుంచి ఆమోదం రాకపోతే ప్రతిపక్ష పార్టీ సభ్యులు ఆందోళన చేపట్టడం సాధారణం. ఆందోళన చేపట్టే సభ్యులతో మేయర్‌గా హుందాగా వ్యవహరించాల్సిన పీలా శ్రీనివాసరావు, ఆ హోదా గౌరవానికి భంగం కలిగించారు. సభ్యులను ఇష్టానుసారంగా మాట్లాడడం, సభలో సభ్యులు మేయర్‌కు గౌరవం ఇవ్వకుండా మాట్లాడడం చూస్తుంటే కౌన్సిల్ ఒక ఫంక్షన్‌లా మారిందనిపించింది. ఒక సభ్యుడు తన వార్డు సమస్యను చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. గతంలో ఏ మేయర్ కూడా ఇంతగా దిగజారి సభను నడపలేదనే ఆరోపణలు కూటమి పార్టీ కార్పొరేటర్లు కూడా బహిరంగంగా చేశారు. చివరకు కమిషనర్ కేతన్ గార్గ్ జోక్యం చేసుకుని సభ్యులను వారి సీట్లలో కూర్చోమని చెప్పడం మేయర్ వైఫల్యానికి నిదర్శనం.

టీడీఆర్‌లపై గందరగోళం

టీడీఆర్‌ల జారీపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని మురికివాడలున్నాయి, రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల్లో ఎంత మంది నష్టపోయారు, ఎంత మందికి టీడీఆర్‌లు జారీ చేశారు, అసలు నిబంధనలేంటి? ఉడా లేఅవుట్లకు కూడా జీవీఎంసీ అధికారులు ఎలా టీడీఆర్‌లు ఇచ్చేశారు? చివరకు శ్మశానానికి కూడా టీడీఆర్ ఇచ్చేశారంటే అధికారులు ఏ స్థాయిలో ఉన్నారో అర్థమవుతోందని పలువురు సభ్యులు విమర్శించారు. టీడీఆర్‌లకు సంబంధించి ఆన్‌లైన్‌లో 4200 దరఖాస్తులు నమోదైనట్లు తెలిసింది. దీనికి సంబంధించి పలువురు సభ్యులు అధికారులపై మండిపడుతూ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

అనకాపల్లి: పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ శనివారం స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో పాటు మండల, గ్రామ స్థాయిలో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆగస్టు నెల థీమ్ 'వర్షాకాలం పరిశుభ్రత'గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపాల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పథక సంచాలకులు, తదితరులు పాల్గొన్నారు.

30న కల్లుగీత కార్మికుల సమస్యలపై నిరసన



మాట్లాడుతున్న ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రా దేముడు

అనకాపల్లి టౌన్: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రా దేముడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేటు హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తి సమయంలో కల్లుగీత కార్మికులు చనిపోతే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడితే రూ.3 లక్షలు ఇవ్వాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ విపరీతంగా వెలసిన బెల్ట్‌షాపుల వల్ల కల్లు గీత కార్మికులు రోడ్డున పడ్డారని వాపోయారు. ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వమే నీరా కేఫ్‌లు పెట్టాలన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కట్టా ఈశ్వరరావు, గండిబోయిన రాము, జుత్తిక రాము, కొలుసు మహలక్ష్మీనాయడు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఒప్పుకోం

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల నిరసన



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్(విశాఖ): వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తమ గళం వినిపించారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్(ఈవోఐ) పేరుతో కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ వారు శుక్రవారం జీవీఎంసీ ప్రధాన గేటు వద్ద నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు.

ఉద్యమాల ఫలితంగానే స్టీల్‌ప్లాంట్



ఉద్యమాల ఫలితంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పడింది. మా ప్రభుత్వ హయాంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. – బాణాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్

దశల వారీగా ప్రైవేటీకరణ చేస్తున్నారు



స్టీల్‌ప్లాంట్‌ను దశల వారీగా ప్రైవేటీకరణ చేస్తున్నారు. కౌన్సిల్‌లో ఈ అంశంపై గట్టిగా గళం వినిపిస్తాం. ప్లాంట్‌లోని కీలక విభాగాలను 44 ముక్కలుగా చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం దారుణం.
– కె.సతీష్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ

ఉద్యోగులకు తొలగించడం బాధాకరం



తెన్నేటి విశ్వనాథం స్ఫూర్తితోనే స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నాంది పడింది. ఎంతోమంది త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడమే కాకుండా, ఉద్యోగులను తొలగించడం బాధాకరం.
– రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్

గతంలో సభ్యులందరి సమన్వయంతో..



విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తుండటం బాధాకరం. గతంలో విశాఖప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని కౌన్సిల్‌లోని అన్ని పార్టీల (వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ) సభ్యులను సమన్వయపరచి, తీర్మానం చేసి అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం. అది కేంద్రానికి చేరింది. ఇప్పుడు ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. సభ్యులందర్నీ సమన్వయపరచి ప్రభుత్వానికి తీర్మానం పంపడంలో ఎందుకు ఆలోచిస్తున్నారు? దాదాపు ఈ విషయాన్ని రెండు గంటల పాటు నాన్చడంలో అర్థమేంటి?
– గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్

కార్మికుల పొట్టలు కొట్టారు



వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికుల పొట్ట కొట్టారు. ఈవోఐ కింద 44 విభాగాలకు టెండర్లు పిలిస్తే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏం చేస్తున్నారు. విశాఖ ప్రజల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటీకరణ ఆపాలి. – పి.వి.సురేష్, కార్పొరేటర్

ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడి

- భద్రాచలం– విశాఖపట్నం నైట్ సర్వీసుకు పగిలిన అద్దాలు



చింతూరు: భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్తున్న నైట్‌సర్వీసు బస్సుపై గుర్తుతెలియని వ్యక్తి రాళ్లతో దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సాయంత్రం ఆరున్నర గంటలకు భద్రాచలంలో బయలుదేరిన అల్ట్రా డీలక్స్ బస్సు చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లిలో ప్రయాణికులను దింపేందుకు ఆగింది. ఈ క్రమంలో చీకటిలోంచి ఓ రాయి వేగంగా వచ్చి బస్సు ఎడమవైపు అద్దాన్ని వేగంగా తాకి లోపలికి దూసుకొచ్చింది. కుడివైపు అద్దాన్ని దూసుకుంటూ బయటకు వెళ్లిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఇదే సమయంలో డ్రైవరు బస్సును కొంత ముందుకు తీసుకెళ్లి తిరిగి వెనక్కి తీసుకురావడంతో మరోసారి బస్సుపై రాయితో దాడి జరిగిందని వారు తెలిపారు. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. బస్సును స్థానిక పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చి జరిగిన ఘటనపై డ్రైవర్, కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కూటమి హయాంలో కుంటుపడిన పంచాయతీల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘ మండల ప్రధాన కార్యదర్శి తాతాజీ

- 15వ ఆర్థిక సంఘ నిధులు రాక అభివృద్ధికి నోచుకోని పంచాయతీలు
- స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

మునగపాక: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ) ఆరోపించారు. శుక్రవారం మునగపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలకు విడుదలైన నిధులను ప్రభుత్వం వేరే పనులకు బదలాయించడం వల్ల పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం 2099 కోట్ల 15వ ఆర్థిక సంఘ నిధులను రాష్ట్రానికి విడుదల చేసినట్టు చెప్పారు. వాటిని వేరే అవసరాలకు బదలాయించడం విచారకరమన్నారు. రాష్ట్రానికి సంబంధించి 2025–26 సంవత్సరానికి 1,000 కోట్ల మేర నిధులు విడుదల కావాల్సి ఉన్నా ఇంతవరకు రూపాయి విడుదల చేయలేదని తెలిపారు. సర్పంచ్‌లకు గత 8 నెలలుగా గౌరవ వేతనం కూడా విడుదల చేయలేదన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సర్పంచ్‌లు ఆడారి త్రిమూర్తులు,బొడ్డేడ శ్రీనివాసరావు,కర్రి పెదబ్బాయి,ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు,మళ్ల కాశీ సురేష్, తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు లక్ష్యం 56వేల హెక్టార్లు

- జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు

నాతవరం: జిల్లాలో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 56వేల హెక్టార్లలో వరి సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలో తాండవ జంక్షన్, గుమ్మడిగొండ, నాతవరం గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుమ్మడిగొండలో రైతులతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు 40వేల హెక్టార్లలో వరి నాట్లు వేసినట్టు చెప్పారు. వచ్చేనెల మొదటి వారం నాటికి లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. బోర్లు ఉన్న ప్రాంతాల్లో వర్షాలకు ముందే 10వేల హెక్టార్లలో రైతులు వరినాట్లు వేశారన్నారు. ఈఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడం వల్ల జులైలో వేయాల్సిన వరి నాట్లు ప్రస్తుతం చురుగ్గా వేస్తున్నారన్నారు. ఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన ఎరువులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆయన చెప్పారు. ఈఏడాది కాంప్లెక్స్ ఎరువుల రేట్లు అధికంగా ఉండడంతో రైతులు వాటి బదులు యూరియా వేస్తున్నట్టు తెలిపారు. దమ్ము సమయంలో యూరియా వేయరాదని, రైతులకు అవగాహన లేకనే వేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఏడు వేల టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. నాతవరం మండలంలో అన్ని రకాల ఎరువులు 411 టన్నులు ఉండగా వాటిలో 100 టన్నులు యూరియా సిద్ధంగా ఉందన్నారు. మరో రెండు రోజుల్లో జిల్లాకు 350 టన్నుల యూరియా వస్తుందని, దాంట్లో 70 టన్నులు నాతవరానికే కేటాయించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆర్‌బీకేలతో పాటు పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులు అందిస్తున్నట్టు చెప్పారు. నాతవరం మండలంలో పీకే గూడెం పీఏసీఎస్ ద్వారా మాత్రమే ఎరువులు సరఫరా చేస్తున్నామని, మిగతా రెండు పీఏసీఎస్‌లకు ఈ పాస్ యంత్రాలు లేకపోవడంతో వాటికి ఎరువులు సరఫరా చేయలేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నానో యూరియా అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఆయన వెంట పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్, నాతవరం వ్యవసాయాధికారి సుగుణ సిబ్బంది ఉన్నారు.

స్కూలా.. టీడీపీ కార్యాలయమా?



గొలుగొండలో ఎంపీపీ పాఠశాలకు స్వాగతం పలుకుతునున్న టీడీపీ కటౌట్లు

గొలుగొండ: స్థానిక ఎంపీపీ పాఠశాలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుల కటౌట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గొలుగొండ మండలం చోద్యం సహకార బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన చిటికెల సాంబమూర్తి ప్రమాణ స్వీకారం సందర్భంగా నర్సీపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్‌ను ఆహ్వానిస్తూ ఈ కటౌట్లు ఏర్పాటు చేయడంపై విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలకు 50 మీటర్లు దూరంలోనే ఎంఈవో కార్యాలయం ఉన్నా ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

గంజాయి తరలింపుపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్ ద్వారా గంజాయి తరలింపుపై నిఘా పెట్టిన ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట: గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు పోలీస్ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గంజాయి రవాణా, మద్యపానం, పేకాట, ఈవ్ టీజింగ్ వంటి కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణారావు మాట్లాడుతూ రోలుగుంట మండలంలో పలు గ్రామాలకు గంజాయి చేరవేసే కాలిబాటలు తదితర రవాణా మార్గాల్లో నిరంతర నిఘా ఉంచామన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఒకే రోజు వందల మందికి ధ్రువపత్రాల పరిశీలన జరగడంతో ఉదయం 6 గంటల నుంచే సందడి నెలకొంది. ఈ ప్రక్రియ కోసం అధికారులు ప్రత్యేకంగా 10 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 659 మంది అభ్యర్థుల్లో 627 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. ఎంపికైన 70 మంది మహిళా అభ్యర్థుల్లో 69 మంది హాజరు కాగా, వారి కోసం ప్రత్యేకంగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు పర్యవేక్షణలో సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరావు, ఆర్ఐలు మన్మథరావు, రామకృష్ణారావు, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.తిలక్ బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు



డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: అధిక ధరలకు ఎరువులు విక్రయించొద్దని, ఒకవేళ అలా చేస్తే సంబంధిత డీలర్లపై క్రిమినల్ కేసులు పెడతామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహన్‌రావు హెచ్చరించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఏపీ బస్తా 50 కిలోలు రూ.1350, 28–28–0 రూ.1800 ఉంటుందన్నారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం పెంచాలన్నారు. డీలర్లు యూరియా అధిక ధరలకు అమ్మినా, ఉండి లేదని చెప్పినా వ్యవసాయ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇటువంటి ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 8331056471 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. నర్సీపట్నం మండలంలో యూరియా 165 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 250 టన్నులు డీలర్ల వద్ద ఉన్నాయన్నారు. 36 టన్నుల యూరియా రైతు సేవా కేంద్రాల్లో రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. వరి ఉడుపుల వరకు ఎంత అవసరమో అంత యూరియా జిల్లాలో అందుబాటులో ఉందన్నారు. వరినాట్లు వేసేటప్పుడు ఆఖరి దమ్ములో 25 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. యూరియా మీద ఆధారపడటమే కాకుండా డీఏపీ కానీ, 28–28–0 వాడుకోవాలన్నారు. ఉడిచిన 15 నుంచి 20 రోజుల్లో నానో యూరియా పిచికారీ చేయాలన్నారు.

దండం పెడతాం.. పాఠశాల భవనం నిర్మించండి



దండం పెడుతూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు, (ఇన్‌సెట్) దెబ్బతిన్న పెదపేట పాఠశాల పైకప్పు భాగం

రోలుగుంట: శిథిల స్థితిలో ఉన్న తమ పాఠశాల భవనాన్ని తొలగించి పునర్నిర్మించాలంటూ శుక్రవారం ఎం.కె.ట్నం పంచాయతీ శివారు గిరిజన గ్రామం పెదపేట పాఠశాల విద్యార్థులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో దండం పెడుతూ వినూత్న నిరసన తెలిపారు. ఈ నిరసనకు సారథ్యం వహించిన కె.చిరంజీవి మాట్లాడుతూ ఈ పాఠశాలలో పెదపేట, ఎం.పెదపేట గ్రామాల విద్యార్థులు మొత్తం 22 మందికి విద్యా బోధన సాగుతుందన్నారు. ఈ పాఠశాల భవన నిర్మాణం జరిగి సుమారుగా 40 సంవత్సరాలు దాటిందని, ఇప్పుడు ఈ శిథిల స్థితికి చేరుకోవడంతో ఆందోళన కలుగుతోందన్నారు. పాఠశాల పైకప్పు దెబ్బతిని వర్షాలకు కారిపోతోందన్నారు. పెచ్చులు ఊడి పడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి భవనం పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు.

లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏసియన్ పెయింట్స్ కంపెనీకి సమీపంలో పార్కింగ్ స్థలంలో పడుకున్న వ్యక్తిపై లారీ వెళ్లడంతో మృతి చెందినట్లు సమాచారం. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ రాంబిల్లి పోలీసులు అందుబాటులోకి రాలేదు. ఈ ప్రమాదం గురువారం రాత్రి జరిగినట్లు తెలుస్తోంది. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

మీ చేతుల్లోనే ఆరోగ్యం, భవిష్యత్తు



క్విజ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి: మీ ఆరోగ్యం, భవిష్యత్తు మీ చేతుల్లో ఉందని డీఎంహెచ్‌వో వై.హైమావతి విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పలు జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆమె శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని, మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. కష్టపడి చదువుకోవడం కంటే ఇష్టపడి చదువుడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఉద్యోగులు, సీఎస్‌వో స్పందన ప్రశాంతి, ఐసీటీసీ కౌన్సిలర్స్ ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి యువకుల వీరంగం

- పెకిళ్లపాలెంలో వెలుగు వీవోఏ కుటుంబంపై దాడి
- వీవోఏ గోవింద్ పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన వీవోఏ మెంట్రెడ్డి గోవింద్

యలమంచిలి రూరల్: డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం వద్ద ముగ్గురు యువకుల మధ్య తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలి వానై ఓ కుటుంబంపై దాడికి దారి తీసింది. తమ్ముడిపై కక్షతో 12 మంది యువకుల బృందం అన్న ఇంటికి వెళ్లి మూకుమ్మడిగా దాడికి పాల్పడింది. దాంతో వెలుగు వీవోఏ మెంట్రెడ్డి గోవింద్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు మహిళలకు కొకు దెబ్బలు తగలాయి. గాయపడిన వీవోఏ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దాడికి పాల్పడిన యువకుల హల్‌చల్‌తో మండలంలోని షేకిళ్లపాలెంలో గురువారం అర్ధరాత్రి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. బాధిత కుటుంబీకులు, యలమంచిలి రూరల్ పోలీసులు తెలియజేసిన వివరాలివి.. యలమంచిలి, కశింకోట మండలాల సరిహద్దు గ్రామాలైన చిన షేకిళ్ల పాలెం, అచ్చుతపురం గ్రామాల్లో గురువారం గ్రామదేవత నల్లమారమ్మ పండగ జరిగింది. ఈ జాతరలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ స్టేజీ ప్రోగ్రాం వద్ద చిన షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన మెంట్రెడ్డి చంటికి మరో ఇద్దరు పెద షేకిళ్లపాలెంకు చెందిన మరిశా శంకర్, మరికొంత మంది యువకులకు మధ్య వివాదం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న చంటి అన్నయ్య మెంట్రెడ్డి గోవింద్, అతని భార్య వేణు అక్కడకు వెళ్లారు. చంటిని ఇంటికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పెద షేకిళ్లపాలెంకు చెందిన భీముని అశ్విన్, మరో 11 మంది యువకులు రాత్రి 11.30 గంటల సమయంలో మెంట్రెడ్డి చంటిపై దాడి చేయడానికి చిన షేకిళ్ల పాలెంలో అతని ఇంటికి వెళ్లారు. అక్కడ వారికి చంటి దొరక్కపోవడంతో మెంట్రెడ్డి గోవింద్, అతని భార్య వేణులపై మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. గోవింద్ తలకు బలమైన గాయంతో తీవ్ర రక్త స్రావం కావడంతో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా, అక్కడ్నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేయగా, కుటుంబీకులు గోవింద్‌ను అనకాపల్లి బెనర్జీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. దాడికి పాల్పడిన యువకుల్లో కొంతమంది వద్ద చాకు, కత్తి వంటి మారణాయుధాలు, కర్రలు ఉన్నాయని బాధిత కుటుంబీకులు సాక్షికి తెలిపారు. ఈ దాడిలో గోవింద్ భార్య వేణు, మరిశా లక్ష్మిలకు కొకు దెబ్బలు తగిలాయి. లక్ష్మి మెడలో బంగారు గొలుసును యువకులు తెంచేశారు. తెగిపోయిన గొలుసు ముక్కను పోలీసులకు చూపించారు. దీనిపై గోవింద్ తల్లి వరహాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద షేకిళ్లపాలెంకు చెందిన భీముని అరుణ్, బండారు వాసు, శానాపతి శ్రీను, చందక రవి, ప్రగడ ఆనంద్, గందూరి వాసు, భీముని అశ్విన్, బండారు నవీన్, భీముని నూకరాజు, ఎలిశెట్టి గంగాధర్, పూడి అప్పలనాయుడు, భీముని చిరంజీవి లపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు.

క్లుప్తంగా

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

- డీఎస్పీ శ్రావణి



హైవేపై ప్రమాదకర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కశింకోట: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు మండలంలో రోడ్డు ప్రమాదాలు జరిగే కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం కూడలి ప్రాంతాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు గురించి చర్చిస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ రాజమండ్రి డివిజన్ మేనేజర్ నవీన్, సీఐ అల్లు స్వామినాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

అనకాపల్లి టౌన్: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ప్రభుత్వం అవగాహన కల్పించాలని కర్షక దేవోభవ మిషన్ జాతీయ చైర్మన్ ఆడారి కిషోర్ కుమార్ తెలిపారు. పట్టణంలోని రోటరీ హాల్‌లో అనకాపల్లి–మన రైతాంగం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర దేశాల్లో వ్యవసాయంలో అనేక నూతన పద్ధతులు పాటిస్తున్నారని, మన దేశంలో నేటికీ పాత పద్ధతులే అనుసరిస్తున్నారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ధ రామణాజీ, బుచ్చిరాజు, మురళీకృష్ణ, అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాయుడు మృతికి సంతాపం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం ప్రాంతానికి చెందిన డాక్టర్ ఏఏ నాయుడు మృతికి పలువురు సంతాపం తెలిపారు. గురువారం రాత్రి మృతి ఆయన విశాఖపట్నంలో తన స్వగృహంలో మృతి చెందారు. ఈయన ఐదు దశాబ్దాలుగా వైద్య వృత్తితోపాటు సామాజిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేవారు. ఈయనకు ఇద్దరు సంతానం కాగా, అంత్యక్రియలు శనివారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించనున్నారు.

అప్పన్నకు బంగారు గొలుసు బహూకరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శ్రీకాకుళానికి చెందిన వైశ్యరాజు రాజారాం కిరణ్‌రాజ్ దాత శుక్రవారం 49 గ్రాముల బంగారు గొలుసును కానుకగా అందించారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత ఆ గొలుసును ఆలయ డిప్యూటీ ఈవో సింగం రాధకు అప్పగించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంను అధికారులు అందించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 22 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడోరకం	3,300	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా : వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-1: పరదా
సత్యనారాయణ స్క్రీన్-2: మేఘాలు చెప్పిన ప్రేమకథ
పర్తిసాయి : మహావతార్ నరసింహం
షిర్డీసాయి : కూలీ
వెంకటేశ్వర : బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య : సోమేశ్వర సులోచన
రామచంద్ర : వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-16, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 324 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

టీకా.. ఆరోగ్యం ఎంచక్కా!



గవరపాలెం పశువుల ఆస్పత్రిలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు అనిల్

- పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి
- లేదంటే వాటి నుంచి మనిషికి సోకితే హానికరం
- అన్ని పశువుల కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ

అనకాపల్లి: రైతుల నుంచి పారిశ్రామికవేత్తలు దాక ఏదోఒక రూపంలో జంతువులతో సహవాసం చేస్తున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ నిమిత్తం ఆవులు, గేదెలు, వ్యాపార నిమిత్తం గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, కొంతమంది కుక్కలు, పిల్లులు, ఇతర జంతువులు కొనుగోలు చేసి గృహాల్లో పెంచుతున్నారు. వీటి నుంచి వివిధ రకాలైన వ్యాధులు మానవులకు వ్యాప్తి చెందుతున్నాయి. దాంతో అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలు పోయే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో వాటికి ముందస్తుగా టీకాలు వేయిస్తే మనుషుల్ని కరిచినా ప్రమాదం నుంచి బయటపడవచ్చు. అనకాపల్లి పట్టణ, మండలంలో ఆవులు, గేదెలు 19 వేలు పైచిలు ఉండగా, గొర్రెలు, మేకలు 23 వేలు, పందులు 20వేలు, కుక్కలు 12వేలు, కోళ్లు 45వేలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదికాక ఎవరికీ ఇళ్లలో ఎలుకలు సావాసం చేస్తుంటాయి. జంతువులు కారణంగా సోకే వ్యాధులపై అవగాహన కల్పించుకుని జాగ్రత్త వహించకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రధానంగా పశువుల నుంచి మానవులకు సంక్రమించే స్వభావం ఉన్న వ్యాధులు జూనోటిక్ వ్యాధులు సోకకుండా పశువులకు వ్యాక్సినేషన్ తప్పనసరిగా చేయించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

పశువులకు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకా మందులు వేయించాలి. పెంపుడు జంతువులకు వారానికొకసారి స్నానం చేయించాలి. జూలు కుక్కలకు ప్రతిరోజు దువ్వాలి. పెంపుడు క్కులకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాపించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, రోజూ స్నానం చేయడం, గోళ్లను ఎక్కువగా పెంచుకోకుండా ఉండటం, తినేముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. వేడిచేసిన పాలను మాత్రమే తాగాలి. బాగా ఉడకపెట్టిన మాంసాన్నే తినాలి. వ్యాధిగ్రస్తు జంతువు మాంసం తినడం వల్ల మనిషి వ్యాధులు బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చనిపోయిన పశువులను సున్నపు గంటలతో లోతుగా పాతిపెట్టాలి. జంతువుల అనారోగ్య లక్షణాలను గమనించి పశు వైద్యులను సంప్రదించాలి.

జంతువుల నుంచి సోకే వ్యాధులు...

పశువుల ద్వారా మకూరి, గాలికుంట, రేబిస్, అంత్రాక్స్, లిస్టీరి యోసిస్, బ్రూసెల్లోసెస్, క్యూ ఫీవర్, క్షయ, రామర, బెజీసియోసిస్, ఫైలేరియాసిస్, హైడాటి దోసిస్, ట్రిపనసోమియానస్, టాక్సోప్లాస్మానస్ వంటి వ్యాధులు సోకుతాయి. కుక్కలు, పిల్లుల ద్వారా రేబీబి, లెప్టోస్పైరోసిస్, తామర, ట్రిఫనసోమియా సీస్, టాక్సోప్లోస్మోసస్, లార్వామైగ్రాఫ్, కాట్ స్క్రాచ్ ఫీవర్ వ్యాధులు సోకుతాయి. పందులు ద్వారా మెదడువాపు వ్యాధి, గాలికుంటు, ఇన్ఫ్లుయంజా, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, లిస్టీరియోసిస్, సార్కోనల్లోసిస్, హైడాటిడోసిస్, తామర, ట్రిలినెల్లోసిస్ వ్యాధులు వస్తాయి. కోళ్లు, పక్షుల ద్వారా ఇన్ఫ్లుయంజా, క్లమీండియోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లోసిస్, క్షయ, తామర, సిజ్జికోసిస్ వ్యాధులు సోకుతాయి, గొర్రెలు, మేకల ద్వారా లేబీస్, అంత్రాక్స్, లిస్టీరియోసిస్, బ్రూసెల్లోసిస్, డ్యూ ఫీవర్, సాల్మోనెల్లోసిస్, హైడాటిడోసిస్, టాక్సోప్లాస్మోసిస్, ట్రిపన సోమియాసిస్, ఎలుకలు ద్వారా రోసిస్, ప్లేగు వంటి వ్యాధులు సోకుతాయి.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులు, మనుషులకు ఎంతో ఉపయోగం, పశు వైద్యశాల వద్ద ఉచిత టీకాలు వేస్తాం. సంక్రమిత వ్యాధులు రాకుండా తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పెంపుడు జంతువులను పెంచేవారు పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలి. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– పి. అనిల్, గవరపాలెం పశువైద్యశాఖ అధికారి, అనకాపల్లి

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

అసిస్టెంట్ అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి



మాట్లాడుతున్న అసిస్టెంట్ అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి

కశింకోట: టెన్త్, ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు ఈ ఏడాది కూడా శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అసిస్టెంట్ అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి తెలిపారు. మండలంలోని తేగాడ మోడల్ స్కూలును శుక్రవారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా వ్యవహరించి గతంలో వలె టెన్త్, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణులు కావడానికి దోహదపడాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో సరళంగా బోధన సాగించాలన్నారు.

ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలకు నిర్దిష్ట రాకపోక వేళలు పాటించాలన్నారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల నోట్ పుస్తకాలు, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. వీటిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్ ఐ. మార్తా తిలకంకు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజును సత్కరిస్తున్న నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. ఇటీవల పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉత్తరాంధ్ర జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే అన్నపురెడ్డి అదీప్‌రాజును శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డులోని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఏడాదిన్నరకే కూటమి పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేయడం వల్ల సూపర్ సిక్స్‌లో కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకూ పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పట్టణ, మండల, కశింకోట యువజన విభాగాల అధ్యక్షులు వేగి త్రినాథ్, బాదపు హరికృష్ణ, నీటిపల్లి దివాకర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి, దిగుమతులపై ఆంక్షలు తగదు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎగుమతి, దిగుమతి వాహనాలపై సమయ వేళలపై పోలీస్ శాఖ పెట్టిన ఆంక్షలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పట్టణ ముఠా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి రోజూ సరుకులు తీసుకురావడానికి అనేక లారీలు వస్తుంటాయన్నారు. దీని వల్ల ప్రభుత్వానికి అధిక ఆదాయం వస్తుందన్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చి రెండు వేల మందికిపైగా ముఠా కళాసీలు, పార్శిల్ వ్యాన్‌లు, తోపుడు బండ్లు కార్మికులు ఇదే వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారన్నారు. సమయ వేళలపై పోలీసులు ఆంక్షలు పెట్టడం వల్ల వీరందరికీ ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

శ్మశాన వాటికకు సౌకర్యాలు కల్పించాలి

82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత



కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి: పట్టణంలోని 82వ వార్డు జీవీఎంసీ పరిధి పరశురాంపేట క్రైస్తవుల శ్మశానవాటికకు నీటి సదుపాయం, లైటింగ్, షెల్టర్ సౌకర్యాలు కల్పించాలని వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత కోరారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో జోనల్ పరిధిలో క్రైస్తవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. శ్మశాన వాటికలో చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాలకు నిలయంగా మారిందని, అంత్యక్రియలు సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్య నియంత్రణపై రాస్తారోకో



లంకెలపాలెం కూడలిలో రాస్తారోకో నిర్వహించిన సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: ఫ్లైయాష్, బొగ్గు లారీలు విడుదల చేస్తున్న కాలుష్యం నుంచి లంకెలపాలెం ప్రజలకు విముక్తి కలిగించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిటు ఆధ్వర్యంలో లంకెలపాలెం కూడలిలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమలకు చెందిన బొగ్గు, బూడిద లారీలు పరిమితి మించి అధిక లోడ్లతో ప్రయాణించి, తీవ్ర కాలుష్యానికి కారణమవుతున్నాయని ఆరోపించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న విష వాయువులు ఇబ్బందికరంగా మారాయన్నారు. భారీ వాహనాల ద్వారా ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ప్రజలు ఇళ్లలో ఉండలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బూడిద, బొగ్గు లారీలపై దాడులు జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిటు నాయకులు కె.వెంకట్రావు, కె.వెంకటస్వామి, వి.పద్మ, నానాజీ అమ్మ, అప్పారావు, శ్రీను, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కోర్టులో ధిక్కరణ కేసు వేస్తాం



బ్రిటిష్ సమాధులను పరిశీలిస్తున్న అజశర్మ తదితరులు

నర్సీపట్నం: స్థానిక బ్రిటీష్ సమాధుల స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను కూల్చకపోతే కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి గుర్తుగా ఉన్న బ్రిటిష్ సమాధులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ అల్లూరి పోరాటానికి స్మృతిగా ఉన్న బ్రిటిష్ సమాధుల స్థలం అక్రమించి నిర్మాణాలు చేస్తుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలని కూల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి వేదిక నాయకులు శాస్త్రి, టాక్స్ పేయర్ అసోసియేషన్ నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే న్యాయవాద వృత్తిలో రాణింపు



న్యాయ విద్యార్థుల తరగతి గదుల్ని పరిశీలిస్తున్న ఆచార్య రణబీర్ సింగ్ తదితరులు

సబ్బవరం: న్యాయ విద్యార్థులు క్రమశిక్షణతో, కష్టపడి చదివితే న్యాయవాద వృత్తిలో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని నల్సార్ యూనివర్సిటీ, ఢిల్లీ నేషనల్ లా యూనివర్సిటీల పూర్వ ఉపకులపతి ఆచార్య రణబీర్ సింగ్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లోని ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయవిద్యను అభ్యసించేవారు ఎంతో మెళకువతో తమ చదువును కొనసాగించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న పోకడలు, వాటికి అనుగుణంగా చట్టాల్లో వస్తున్న మార్పులను అవలోకనం చేసుకుంటూ, చదువు కొనసాగించాలని సూచించారు. గతంలో వేరే అవకాశాలు లేక న్యాయ విద్యను ఎంచుకునేవారని, ప్రస్తుతం న్యాయ విద్యను ఎంతో ఇష్టంగా ఎంచుకుని చేరుతుండటంతో భవిష్యత్తుపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు, హైకోర్టులలో న్యాయాధిపతులుగా ఉన్న తమ విద్యార్థులు, ఆ స్థాయికి చేరడానికి ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయ విద్య, దానిలోని ఉపాధి అవకాశాలపై ప్రతివారం నిపుణులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ ఆచార్యులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, ఇన్‌స్టిట్యూట్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఏ గ్రూపులోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థులు రెండేళ్ల డిప్లమో ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డిప్లమో ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, డిప్లమో ఇన్ ఆప్టోమెట్రీ టెక్నీషియన్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు నాలుగేళ్ల వ్యవధి ఉన్న బీఎస్సీ ఆప్టోమెట్రీ చేసేందుకు అర్హులన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో శంకర్ ఫౌండేషన్ కళాశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91210 05933, 99635 82130 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

- ఆలయాల్లో భక్తుల రద్దీ
- నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్




కనకదుర్గమ్మ కొండపై సామూహిక కుంకుమ పూజలు



గవరపాలెం సతకం పట్టు కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకరణ



సత్యనారాయణపురం కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



మధురఫలాలతో నూకాంబిక ఆలయం అలంకరణ



కశింకోటలో పూజలందుకున్న కనకమహాలక్ష్మి

అనకాపల్లి: పట్టణ, మండలంలో ఐదో శ్రావణ శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. పలు అమ్మవారి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారిని వివిధ రకాల మధురఫలాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులతో అర్చకులు ఉచితంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారిని కలెక్టర్ విజయకృష్ణన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టగా, ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు అమ్మవారు భక్తులకు వివిధ రకాలైన మధురఫలాలతో దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



నూకాంబికను దర్శించుకుంటున్న కలెక్టర్

గవరపాలెం సంతోషిమాత ఆలయం...

స్థానిక గవరపాలెం నిదానందొడ్డి సంతోషిమాత ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులతో సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. అమ్మవారు భక్తులకు బాల సంతోషిరూపంలో దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఈవో బి.మురళీకృష్ణ, ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్‌రావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం కోటవీధిలో...

స్థానిక గవరపాలెం కోటవీధిలో భోగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు భక్తులకు శ్రీకృష్ణ అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. ప్రదోష కాల సమయాన మహాన్యాస పూర్వక రుద్రాభిషేక పూర్వక దీపాలంకరణ వంటి సేవా కార్యక్రమాలను అలయ అర్చకులు చిన్నిస్వామి చేపట్టారు.

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో....

శ్రావణమాసం పురస్కరించుకుని సతకంపట్టు కనకదుర్గమ్మను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గవరపాలెం నిదానందొడ్డి సంతోషిమాత ఆలయంలో బాల సంతోషిమాతగా భక్తులకు దర్శనం

మండలంలో...

సత్యనారాయణపురం పంచాయతీ కనకదుర్గమ్మ ఆలయం కొండపై అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. కొండపైన మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్, ధర్మకర్త బోయిన రమణాజీ, చైర్మన్ కోటిపల్లి కిషోర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కోటవీధిలో భోగలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణావతారం

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకుడు వి. కృష్ణ వేదమంత్రాలతో పూజలు చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించి పూజలు చేశారు. స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతస్వామి ఆలయం (శివాలయం)లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకుడు వి. చిదంబరం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో కాంస్యం

ఇంజినీరింగ్ విద్యార్థినికి అభినందన



కొణతాల మోనాలిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

అనకాపల్లి టౌన్: ఇటీవల చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయి 36వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని గవరపాలెం ప్రాంతానికి చెందిన విద్యార్థిని కొణతాల మోనాలి సిల్వర్ మెడల్ సాధించింది. అథ్లెటిక్స్ అండర్-20 కేటగిరీలో పోటీపడిన ఈమె దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్కరించింది. అధ్యాపకులు వి. మధుసూదనరావు, పీడీలు సిహెచ్ రాంబాబు, జె ప్రశాంత్ తదితరులు అభినందించారు.